

● రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు క్లినిక్ వద్ద రోగులు

పల్లెల్లో విషజ్వరాలు!

- మూడు నెలలుగా మంచం పట్టిన గ్రామీణ ప్రజలు
- ఉమ్మడి డిచ్‌పల్లి మండలంలో 80 డెంగ్యూ కేసులు
- అనధికారికంగా వందల్లో బాధితులు
- నేటికీ కోలుకోలేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు

ఇందల్వాయి, సెప్టెంబరు 21: గ్రామాల్లో విష జ్వరాలు రోజురోజుకూ విజృంభిస్తున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల రోగాలు ప్రబలుతున్నాయి. దోమల వ్యాప్తికి ప్రత్యేక అధికారుల పాలనలో సరైన చర్యలు చేపట్టకపోవడం పారిశుధ్య లోపంతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దీంతో జ్వరాల వల్ల గ్రామాల్లో ప్రజలు వణికిపోతున్నారు.

చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కూలీ నాలి చేసి సంపాదించిన డబ్బులు కాస్త ఆసుపత్రుల్లో ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లో విషజ్వరాలతో ప్రజలు బేజారు అవుతున్నారు. డెంగ్యూ కేసులతో భయాందోళనకు గురవుతున్నారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రెండు మండలాల్లో ఇప్పటివరకు 80 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని స్థానిక వైద్యాధికారి సంతోష్ తెలిపారు. జనవరి నుంచి జూలై వరకు 40 కేసులు నమోదు కాగా, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మరో 40 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ప్ర తీ ఇంటిలో ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారు. వైద్యసిబ్బంది ఇంటింటికి తిరుగుతూ జ్వర సర్వే చేపడుతున్నప్పటికీ కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. విషజ్వరాల బారిన పడిన ప్రజలు ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అధికంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యాతోపాటు రక్తకణాలు తగ్గుతుండటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. లక్షల రూపాయలు ఆసుపత్రు ల్లో దారపోయాల్సి వస్తుందని వాపోతున్నారు.

అపరిశుభ్రత వల్లే విష జ్వరాలు

గ్రామాల్లో సర్పంచుల కాల పరిమితి ముగిసినప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రత్యేక అధికారులు ఒక్కోక్కరికి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీలు అప్పచెప్పడంతో గ్రామాల అభివృద్ధికి సరైన సమయం కేటాయించకపోవడం గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడం వల్ల పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడంతో డ్రైనేజీలు, పరిసరాల అపరిశుభ్రత ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగి రోగాలు ప్రబలుతున్నాయి. దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం వల్లే గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.



ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● వైద్యాధికారి సంతోష్


గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వృద్ధిని అరికట్టవచ్చు. వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. ఇం టిపరిసరాల్లో కుండీలు, టైర్లు, కొబ్బరిబొండాల్లో నీరు నిలువ కుండా చూడాలి. ప్రతీరోజు ఆశాకార్యకర్తలతో ఇంటింటి సర్వే నిర్వహించి బాధితులను గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్యం అందిస్తున్నాం. డెంగ్యూ, చికున్ గున్యా బారిన పడ్డవారిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నాం. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 16 సబ్ సెంటర్లు, 48 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వీటిని పర్యవేక్షించేందుకు సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల కొంత మేరకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి

- 18 మంది పాలకవర్గ సభ్యులను నియమించిన ప్రభుత్వం
- త్వరలో మరికొన్ని నామినేటెడ్ పోస్టుల భర్తీ



ముప్ప గంగారెడ్డి

నిజామాబాద్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఎట్టకేలకు నియమించారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న ముప్పగంగారెడ్డిని చైర్మన్‌గా నియామకం చేశారు. ఆయనతో పాటు మొత్తం 18 మంది పాలకవర్గ సభ్యులను నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. కొత్తగా నియామకం చేసిన చైర్మన్, పాలకవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగనున్నారు. జిల్లాలో కీలకమైన ఈ వ్యవసాయ మార్కెట్‌కు పాలకవర్గాన్ని నియమించిన ప్రభుత్వం మరికొన్ని నామినేటెడ్ పోస్టులను కూడా వారం రోజుల లోపే నియామకం చేయనున్నారు. ఈ పోస్టులతోపాటు రాష్ట్రస్థాయి పోస్టులను కూడా భర్తీ చేపట్టనున్నారు.

సీనియర్ నేతను వరించిన చైర్మన్ పదవి

రాష్ట్రస్థాయిలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరున్న నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రభుత్వం పాలకవర్గాన్ని నియమించింది. ఈ మార్కెట్ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత ముప్ప గంగారెడ్డిని నియమించింది. మోపాల్ మండలానికి చెందిన ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో రైతుసంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయనతోపాటు వైస్‌చైర్మన్‌గా జంగిటి రాంచందర్‌ను నియమించారు. సభ్యులుగా ఐల రాజలింగం, ఎన్నం బాగారెడ్డి, దండ్ల రాజన్న, మేగావత్ మంగిత్య, గ్యానాజి గంగారెడ్డి, వంగ దేవకర్ణ, పెంట ఇంద్రుడు, సాయినేని వెంకటేశ్వరరావు, కూడపు రఘువీర్, మహ్మద్ ఈషా, జోగిని మల్లేష్, అలిగేటి నరేందర్‌కుమార్‌లను సభ్యులుగా నియమించారు. వీరితో పాటు బర్ధిపూర్ సహకా ర సంఘం చైర్మన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, నిజామాబాద్ వ్యవసాయ శాఖ ఏడీ, నగర మేయర్‌ను కూడా ఈ పాలకవర్గం సభ్యులుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులిచ్చారు. వీరు ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు.

మూడేళ్ల తర్వాత చైర్మన్ నియామకం

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి గత మూడేళ్లుగా చైర్మన్ లేరు. పాలకవర్గం సభ్యులు లేరు. అధికారుల ఆధ్వర్యంలోనే మార్కెట్‌లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. పసుపు, మొక్కజొన్న, ధాన్యంతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తులను రైతులు ఈ మా ర్కెట్‌కు తీసుకువచ్చి ప్రతీఏడాది అమ్మకాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఆదాయం వచ్చే ముఖ్యమైన మార్కెట్‌లలో నిజామాబాద్ మార్కెట్ కూడా ఉంది. పసుపు క్రయవిక్రయాల సమయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తిన పాలకవర్గం సభ్యులు లేక వల్ల సమస్యలను ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు, రైతు సంఘాల నేతలు ఈ మార్కెట్ పదవులను భర్తీ చేయాలని కోరినా నింపలేదు. ఇన్నాళ్లకు ప్రభుత్వం సీనియర్ కాంగ్రెస్ నేత, కిసాన్ కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షుడిగా పనిచేస్తున్న ముప్ప గంగారెడ్డిని చైర్మన్‌గా నియమించారు. ఈమార్కెట్ పరిధిలో నిజామాబాద్, నిజామాబాద్‌రూరల్, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల మండలాలు ఉండటంతోవాటి పరిధిలోని వారిని అవకాశం కల్పించారు.

త్వరలో మరిన్ని పోస్టుల భర్తీ

ఈవారం రోజుల్లోపే నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. నుడా చైర్మన్‌గా నగర అధ్యక్షుడు కేశవేణు ఖరారు కావడం తో త్వరలో ఉత్తర్వులు వెలు వడనున్నాయి. దీంతోపాటు జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంతిరెడ్డి రాజరెడ్డి నియామకం కూడా కానున్నట్లు తె లుస్తోంది. పార్టీ నేతల సమాచారం బట్టి వచ్చేవారంలో ఈ పదవులను భర్తీచేయనున్నారు. వీరితో పాటు ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని మార్కెట్ కమిటీలను కూడా భర్తీ చేయనున్నారు. జిల్లాకు చెందిన ఒకరిద్దరికి కూడా రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

గాంధీభవన్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమీక్ష

- పీసీసీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో సమావేశం
- పాల్గొన్న రాష్ట్ర ఇంచార్జి దీపాదాస్ మున్షీ
- హాజరైన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, చైర్మన్‌లు, నేతలు



పీసీసీ సమీక్షలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా నేతలు

నిజామాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ సమీక్ష సమావేశం శనివారం గాంధీభవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ, కార్యదర్శి విశ్వనాథ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. వచ్చేస్థానిక సంస్థల ఎన్నికలు, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. పార్టీ క్యాడర్‌కు భరోసా కల్పించడంతోపాటు ఉమ్మడి జిల్లాస్థాయిలో అందరూ కార్యక్రమాల్లో పాల్గొనేలా దృష్టిపెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఆయా నియోజకవర్గాల వారీగా పార్టీ అంశాలపై చర్చించారు. ఈసమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావు, ఎంపీ సురేష్‌షెట్కార్, రాష్ట్రప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, కాసుల బాల్‌రాజు, మార గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, రాజేశ్వర్, ఆకుల లలిత, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నగేష్‌రెడ్డి, గడుగు గంగాధర్, నిజామాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు, నియోజకవర్గ ఇంచార్జిలు సునీల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డితో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

టీయూ కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లో పాము కలకలం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 21: తెలంగాణ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ కళాశాల ల్యాబ్‌లో ఓ నాగుపాము శనివారం కలకలం రేపింది. ల్యాబ్‌లో ఉన్న విద్యార్థులు, అక్కడ పనిచేసే సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. సిబ్బంది చాకచక్యంగా పామును బయటికి పంపడంతో ప్రమాదం తప్పింది.



ల్యాబ్‌లోకి వచ్చిన నాగుపాము



మాట్లాడుతున్న నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్

ఓటరు జాబితాలో తప్పులు, ఒప్పుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి: ఆర్డీవో

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు21: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరు జాబితాలో ఉన్న తప్పులు, ఒప్పులను సరిచేసే ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్‌లతో అవగాహన సదస్సు నిర్వహించారు. బూత్ లెవల్ ఆఫీసర్‌లు గ్రామస్థాయి ఆఫీసర్‌లతో ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో తప్పులు, ఒప్పులు ఉంటే సర్వే చేసి ఇంటింటికీ వెళ్లి సరిచేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ కిరణ్మాయి. ఆర్‌ఐ ప్రవీన్, బూత్ లెవల్ ఆఫీసర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు21: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్‌కు జిల్లా ఉన్నతాధికారులు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద ఘనస్వాగతం పలికారు. జిల్లా కోర్టు భవనంలో నిర్వహించే న్యాయాధికారుల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు శనివారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద జిల్లా జడ్జి కె.సునీత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, అయా శాఖల జిల్లా అధికారులు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు స్వాగతం పలికి పుష్పగుచ్చాలు, మొక్కలు అందించారు.

- విద్యాశాఖలో ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో వసూలు
- 'సమగ్ర శిక్ష'లో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన పలువురు !?
- కలెక్టర్‌కు ఫిర్యాదు.. విద్యాశాఖ విచారణలో తేలనున్న నిజాలు
- జిల్లాలో రాజు వెనుక ఉన్నది ఎవరు ?



సూత్రధారులెవరో..?

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 21: జిల్లా విద్యా శాఖ సమగ్ర శిక్షా అభియాన్‌లో ఇటీవల నకిలీ ఉద్యోగాల నియామకాల్లో అసలు సూత్రధారులు ఎవరో, పాత్రదారులు ఎవరో అనే విషయంలో విద్యాశాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. గ్లోబల్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ పాఠశాలలో ఉచితంగా వాలంటీర్లను నియమించేందుకు ముందుకు రాగా.. ఇదే అదనుగా కొంతమంది నకిలీ సర్టిఫికెట్లను రూపొందించి నకిలీ ఉద్యోగాల పేరుతో అమాయకులైన యువతను మోసం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు రాగా, ఆయన జిల్లా విద్యాశాఖ అధికారిని విచారణకు ఆదేశించారు. ఈమేరకు సమగ్ర శిక్ష అధికారులు నియామకాల్లో నకిలీ ఉద్యోగాలు పొందిన నలుగురిని గుర్తించారు. బాల్కొండ డివిజన్ పరిధిలోని నకిలీ ఉద్యోగాల పేరుతో నలుగురు ఉద్యోగాలు పొందినట్లు గుర్తించారు. ఈ మేరకు శనివారం విద్యాశాఖ అధికారులు నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసును బాల్కొండ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ సైతం నకిలీ ఉద్యోగాల విషయంలో సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉండి మౌలిక నదుపాయాలు లేని విషయాన్ని గుర్తించి గ్రామస్థాయిలోనే వలంటీర్లను నియమించుకుంటే తామే వేతనాలను ఇస్తామని సంస్థ ఉదారంగా ముందుకు వస్తే కొంతమంది నకిలీ ఉద్యోగాల పేరుతో మోసం చేయడంపై సంస్థ సీఈవో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సంస్థ తరఫున సోమవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది.

● రాజు వెనుక ఉన్న అసలు దొంగ ఎవరో..!?

సమగ్ర శిక్షా అభియాన్‌లో గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ పేరుతో నకిలీ ఉద్యోగాల వెనుక నిర్మల్ జిల్లా కడెంకు చెందిన రాజు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. రాజు ఇటీవల నిజామాబాద్ జిల్లాతోపాటు మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, సిరిసిల్లాల్లో సమగ్ర శిక్షాలో ఉద్యోగాల పేరుతో అమాయక యువతను మోసంచేసినట్లు కేసులు నమోదయ్యాయి. జిల్లాలోనూ రాజు పలువురు యువకుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షల్లో వసూలు చేసినట్లు తెలుస్తోంది. నలుగురికి నకిలీ ఉద్యోగ ఉత్తర్వులుఇచ్చిన రాజు.. మరో 10మంది నుంచి డబ్బులు తీసుకొని ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చేందుకు సిద్ధం కాగా, కలెక్టర్‌కు ఫిర్యాదుతో నకిలీ ఉద్యో గాల గుట్టు రట్టయ్యింది. ఇప్పుడు లక్షల రూపాయలు ఇచ్చిన నిరుద్యోగ అభ్యర్థులు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రాజు నకిలీ ఉద్యోగాల విషయంలో పాత్రధారి అయినప్పటికీ జిల్లాకు చెందిన కొంతమంది సూత్రధారులు తెరవెనుక ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసులు కేసు నమోదు చేయడంతో రాజును విచారిస్తే అసలు సూత్రదారులు ఎవరో బయటపడే అవకాశాలున్నాయి. గతంలో భవిత సెంటర్లలో ఐఈఆర్‌సీ రిసోర్స్‌పర్సన్ల నియామకంలోనూ అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. గత ఏడాది క్రితం 11 మందిని కొత్తగా నియమించగా.. వారిలో కొంత మంది నకిలీ సర్టిఫికెట్లతోఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నకిలీ సర్టిఫికెట్ల తయారీ వెనుక నగరానికి చెందిన కొంతమంది ప్రముఖులు ఉన్నారు. భవిత సెంటర్లలో పనిచేసే రిసోర్స్‌పర్సన్‌లలో వారి కుటుంబసభ్యులకు ఇదే కోవలో ఉద్యోగాలు ఇప్పించినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారులు లోతుగా దర్యాప్తు జరిపిస్తే అసలు దొంగలు త్వరలోనే పక్కాగా దొరుకుతారు.



కంపోస్టు షెడ్‌లను పరిశీలిస్తున్న డీపీవో

నీటి కుండీలను నిత్యం శుభ్రం చేయాలి

సదాశివనగర్, సెప్టెంబరు 21: నీటి కుండీలను నిత్యం శుభ్రం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం సదాశివనగర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలోని చెత్తను వెంటవెంటనే డంపింగ్ యార్డులకు చేరవేయాలని ప్లాస్టిక్ వ్యర్థాలను విడిగా సేకరించి కంపోస్టుషెడ్‌లోని ప్లాస్టిక్ విభాగంలో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఏపీఎం రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాధవిలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజారెడ్డి

విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు పాటు పడాలి

సదాశివనగర్, సెప్టెంబరు 21: ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ప్రగతి కోసం ఉపాధ్యాయులు అహర్నిశలు కృషి చేయాలని ప్రిన్సిపాల్ రాజారెడ్డి అన్నారు. శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి కోసం నిత్యం కృషి చేస్తామన్నారు. గతంలో మాదిరిగా ఆదర్శ పాఠశాల పేరు ప్రతిష్టలు మరింత మెరుగుపడాలని 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకోసం కృషి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ నరేష్‌గౌడ్

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

రామారెడ్డి, సెప్టెంబరు 21: మండలంలోని పోసన్‌పేట గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేష్‌గౌడ్ తెలిపారు. ఈనెల 17న జరిగిన దొంగతనం కేసులో పల్లెపు రాజు, సుద్దల సంతోష్‌లు 50 మీటర్ల స్ప్రేపంపు, ఒక సోలార్ చార్జింగ్ బ్యాటరీ, 6 ఇబ్రోస్, 2 క్లింపింగ్స్, మరో కేసులో ఒక ట్రాక్టర్ బ్యాటరీలను దొంగిలించడంతో వాటిని స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. వీరిని పట్టుకునేందుకు కృషి చేసిన కానిస్టేబుళ్లు దేవాగౌడ్, రమేష్, పవన్, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సెషన్స్ కోర్టు పీపీగా రాజారెడ్డి

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 21:జిల్లా కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది, పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాదస్తు రాజారెడ్డిని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చీఫ్ సెక్రెటరీ రవిగుప్త ఉత్తర్వులను జారీ చేశారు. పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా ఉన్న ఆయన జిల్లా కోర్టు సెషన్స్ కేసుల్లో ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తారని ఆ ఉత్తర్వులో తెలిపారు. ఈయన గతంలో మూడేళ్ల పాటు జిల్లా సెషన్స్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించారు.

సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మొయినోద్దీన్

రెంజల్,సెప్టెంబరు 21: ప్రభుత్వం సకాలంలో రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని చైర్మన్ మొయినోద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో చైర్మన్ మొయినోద్దీన్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ఉండాలంటే ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ధాన్యాన్ని దళారుల పాలు కాకుండా ఉంటుందని అన్నారు. మహజన సభలో జమ, ఖర్చుల వివరాలను సీఈవో ఇంద్రసేన్ సభ్యులకు వినిపించారు. అనంతరం రైతులకు 2లక్షల రుణమాఫీని చేపట్టాలని, కొత్త రైతులకు క్రాప్ లోన్‌లు అందించాలని, సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సభ్యులందరు తీర్మానించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నారాయణ, కార్యదర్శి రాము గౌడ్, సిబ్బంది సాయిబాబా, కిషోర్, శ్రీనివాస్,ఇంతియాజ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కోటగిరి,సెప్టెంబరు 21: కోటగిరి మండలంలోని లింగాపూర్ శివారులో శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో దాడులు చేశారు. పేకాట స్థావరం వద్ద 46,060 రూపాయల నగదును, 9సెల్‌ఫోన్‌లను, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 9మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యంచలో సామూహిక పితృపక్ష మహోత్సవం

నవీపేట,సెప్టెంబరు 21: మండలంలోని యంచలోని శ్రీ ఓం జగదాద్రి ఆలయంలో శనివారం సామూహిక పితృపక్ష మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రహ్మణులతో ప్రత్యేక హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పితృపక్ష పిండప్రధానం నిర్వహించి గోదావరి నదిలో కలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఓం జగదాద్రి ఆలయ వ్యవస్థాపకురాలు స్వర్ణ కమల లక్ష్మి, జ్ఞాన శక్తియేంద్ర స్వామి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,సెప్టెంబరు 21: పొతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను శనివారం తెల్లవారుజామున తహసీల్దార్ మల్లయ్య పట్టుకున్నారు. సాలూర మండలంలోని మందర్నా మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా సోంపూర్ వైపు తరలిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తహసీల్దార్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

● నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్,సెప్టెంబరు 21: బోధన్ మంజీర సరిహద్దు గ్రామాల నుండి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలను పట్టుకుని సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ప్రభుత్వ అనుమతులతో కూడిన పత్రాలు ఉన్న రోజే ఇసుకను తరలించాలన్నారు. అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ముప్కాల్, సెప్టెంబరు21: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన జెట్టి సాయిబాబు(48) కుటుంబకలహాలతో ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కూతురు వివాహానికి చేసిన అప్పు తీరకపోవడం, మద్యం మత్తులో కుటుంబసభ్యుల గొడవపెట్టికొని బయటకు పంపించేశాడు. శుక్రవారం రాత్రి ఇంటో వెళ్ళి ఉరేసుకుని మృతి చెందాడు శనివారం రాత్రి కుటుంటీకులు ఇంట్లోకి వెళ్ళి చూసే సరికి సాయిబాబు ఉరేసుకొని మృతి చెందినట్టు మృతుని కుమారుడు జెట్టి సాయి కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు ఎస్సై తెలిపారు.

ఆటోను ఢీకొన్న బైక్.. ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట,సెప్టెంబరు 21: మండలంలోని అబ్బాపూర్(ఎం) సమీపంలో శుక్రవారం ఆటోను బైక్ వెనుక నుండి ఢీకొనడంతో గడిల సంతోష్ కుమార్ అనే వ్యక్తి కాలికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ వినయ్ తెలిపారు. నిజామాబాద్ నుండి నవీపేట వైపు ఆటో వస్తుండగా ఆటో డ్రైవర్ అబ్బాపూర్(ఎం) సమీపంలో ఆకస్మాత్తుగా సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుండి వచ్చిన బైక్ ఆటోను ఢీకొనడంతో సంతోష్ కుమార్‌కు గాయాలయ్యాయని ఎస్ఐ తెలిపారు. ఆటోను నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

నవీపేట,సెప్టెంబరు 21: మండలంలోని అభంగపట్నంకు చెందిన అల్లె వినోద్ కుమార్(30)అనే యువకుడు శనివారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి, స్థానికులు తెలిపిన ప్రకారం వినోద్ కుమార్ ఆరు సంవత్సరాల కిత్రం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. తిరిగి దుబాయ్ వెళ్లడానికి వీసా కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మెడికల్ టెస్టులో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీనికి తోడు అప్పులు పెరిగిపోవడంతో శనివారం తెల్లవారుజామున నవీపేట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బట్టాపూర్‌లో ఓటరు జాబితా సవరణ



ఓటరు లిస్టు సరిచేస్తున్న జీపి సిబ్బంది

ఏర్గట్ల, సెప్టెంబరు 21: మండలంలోని బట్టాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఓటరు జాబితాను సరిచేసినట్లు కార్యదర్శి రవి తెలిపారు. అందులో భాగంగా రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డుల వారిగా ఓటరు లిస్టును వేరు చేస్తున్నట్లు తెలిపారు. జీపిలో అందుబాటులో ఉన్న ఓటరు లిస్టులో తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకొని సరిచేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నిర్వాహకులు పద్మ, కారోబార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలో గల ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని బోధన్ డిఎల్‌పీఓ మధుకర్ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు సవరణ జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయితీలలో ఓటర్ల జాబితాను ప్రదర్శించగా ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే 23వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయితీలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీఓ మన్‌మోహన్ శాస్త్రి, ఎడపల్లి పంచాయితీ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



బోధన్‌లో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,సెప్టెంబరు 21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉద్యోగాల్లో, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో 5శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు గైని రాములు, గంగాధర్ అన్నారు. శనివారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో 5శాతం దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల పథకాలలో 2016 దివ్యాంగుల పరిరక్షణ చట్టం ప్రకారం అమలు చేస్తామని నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమన్నారు. దివ్యాంగుల నైపుణ్య అభివృద్ధి కోసం ప్రత్యేక స్కిల్‌డెవలప్‌మెంట్ వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఇళ్ల పథకాలు వెంటనే అమలు చేయాలని, వికలాంగులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని, వికలాంగులకు ప్రతి నెల 6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు షేక్.నజీర్, సాయిలు, చింటు, దేవిదాస్, పీరుగొండ, షాదుల్లా, లక్ష్మణ్, గంగాధర్ పాల్గొన్నారు.

63 జాతీయ రహదారి జగదల్‌పూర్ వరకు విస్తరణ అలైన్‌మెంట్



మోర్తాడ్‌లోని మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకుడు

మోర్తాడ్, సెప్టెంబరు21: నిజామాబాద్ జిల్లా నుంచి 63జాతీయరహదారి జగదల్‌పూర్ వరకు ఆమోదించిన రోడ్డు విస్తరణ అలైన్‌మెంట్ కొనసాగించాలని మాస్‌లైన్ నాయకులు వి.ప్రభాకర్, దేవరాంలు తెలిపారు. శనివారం మోర్తాడ్ మండల కేంద్రంలోని చాయ్‌భార్ బీడీ ఫ్యాక్టరీ ఆవరణలో ఎన్ఎస్ 63వ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్, ఆర్మూర్ డివిజన కార్యదర్శి బి.దేవరాం తెలిపారు. అందరి అమోద యోగ్యంతో జాతీయరహదారి విస్తరణ చేసేందుకు ఆమోదిం చడం జరిగిందని గ్రామపంచాయతీ లేఅవుట్ కూడా రెండు వైపుల వంద ఫీట్లు వదిలిపెట్టి లే అవుట్ ఆమోదించారని పాత డిజైన్ మూలంగా కేంద్ర ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని అన్నారు. కానీ ఒకరిద్దరి స్వార్థం కోసం రాజకీయ ఒత్తిడితో నూతన డిజైన్ అలైన్ మెంట్ రూపొందించి ఆరు వేల మంది బీడీకార్మికుల ఉపాధికి కోల్పోయే విధంగా రోడ్డును నిర్మిస్తున్నారని అన్నారు. చార్‌భాయ్ ఫ్యాక్టరీ బిల్డింగ్‌తో పాటు మూడు సార్లు రైతులు తమ భూ ములు కోల్పోయారని అన్నారు. వరద కాలువ వరదకాలువ, రైల్వే నిర్మాణం, జాతీయ రహదారికి ఇచ్చి రైతులకు జాతీయరహదారి వెడల్పు పనులను చేపడున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా జాతీయరహదారి విస్తరణ పనులు పాత పద్ధతిలోనే కొనసాగిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.కిషన్, సురేష్, అశోక్, ఆనంద్, మందలాది బీడీకార్మికులతో పాటు ఫ్యాక్టరీ మేనేజర్ సత్తెక్క, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ ఏరియా నాయకులు పాల్గొన్నారు.

కోర్టులో జడ్జీలను నియమించాలని వినతి



హైకోర్టు జడ్జికి వినతి పత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

నిజామాబాద్‌లీగల్, సెప్టెంబరు 21 :జిల్లాలోని పలు కోర్టుల్లో జడ్జీలను నియమించాలని కోరుతూ బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి కే.సురేందర్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా పర్యటనలో శనివారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌గౌడ్, న్యాయవాదులు వినతిపత్రం అందించారు. కోర్టు సమీపంలో గల డీఈవో కార్యలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో న్యాయవాదుల వాహనాలకు పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. అదే విధంగా జిల్లాలో ఖాళీగా ఉన్న జడ్జీలు నియామకం కోసం కృషి చేయాలని చెప్పారు. జిల్లా కేంద్రంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జీ, ఐదవజూనియర్ సివిల్ జడ్జీల పోస్టులు ఖాళీగా ఉన్నాయని జడ్జీ దృష్టికి తెచ్చారు. జిల్లా కోర్టులో రెండు లిఫ్టులు పని చేయడం లేదని, పార్కింగ్‌లో కూడా ద్విచక్ర, కార్లు పార్కింగ్ చేయడానికి ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జీ సునీతకుంచాల,సీనియర్,జూనియర్ సివిల్ జడ్జీలు, బార్ అసోసియేషన్ కార్యదర్శి వసంత్‌రావ్, పి. రాజు, దీపక్, సీనియర్‌న్యాయవాది కృపాకర్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.

సైన్స్ భవన నిర్మాణ పనుల పరిశీలన



సైన్స్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 21: తెలంగాణ విశ్వవిద్యాలయంలో నిర్మిస్తున్న నూతన సైన్స్‌భవన నిర్మాణ పనులు రిజిస్ట్రార్ యాదగిరి శనివారం పరిశీలించారు. ప్రభుత్వ ఏజెన్సీ తెలంగాణ స్టేట్‌ఎడ్యుకేషన్ విమెన్ అండ్ అన్ఫ్రా క్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఇంజనీర్ సాయన్న ను నిర్మాణ పనులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలను అనుసరించి పూర్తి చేసి సకాలంలో భవనంను వర్సిటీకి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇందల్వాయి, సెప్టెంబరు 21: ఇందల్వాయి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాము అనే వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందుతుండటంతో అతని కుటుంబానికి మాజీ ఎంపిపి ఇమ్మడి గోపి 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాము నిరుపేద కుటుంబానికి చెందిన వాడని వైద్యం చేయించుకునే స్థోమత లేకనే తాను ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ భోజనం ఆరోగ్యకరం



అన్నప్రాసన చేస్తున్న దృశ్యం

మోస్రా,సెప్టెంబరు 21: మండల కేంద్రంలోని మండల మహిళ సంఘం భవనంలో అంగన్‌వాడీ సీడీపీవో జానకి ఆధ్వర్యంలో జాతీయ 7వ పోషణమాసం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో విభిన్న కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా శనివారం మండల కేంద్రంలో మోస్రా సెక్టార్‌లో అంగన్‌వాడీలోని పోషక వస్తువులతో వివిధ రకాల వంటకాలు ప్రదర్శించి పోషక ఆహారంపై అవగాహన పెంచేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కొందరి పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ రెడ్డి, ఏపీఎం ముఖీమ్, సూపర్‌వైజర్ వినోద, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సాయమ్మ, ఏఎన్ఎం తనూజ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ నరేష్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్‌లు,ఆయాలు, గర్భిణులు, బాలింతలు, మహిళ సంఘం సభ్యులు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

వేల్పూర్, సెప్టెంబరు21: శనివారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా అకల వర్షం కురువడంతో వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దాయ్యింది. ముఖ్యంగా వేల్పూర్ ఇరువైపుల రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న పంట పూర్తిగా వర్షం నీటిలో తడిసి పోయింది. దీంతో రైతులు పలు ఇబ్బందు లు ఎదుర్కొన్నారు. ధాన్యాన్ని కుప్పలుగా చేసి వాటిపై తాటిపత్రాలు కప్పినప్పటికీ భారీ వర్షం కురువడంతో కింది భాగం నుంచి నీరు చేరి మొక్కజొన్న పంట తడిసిపోయింది. ధాన్యంపై వర్షం నీరు పడకుండా చేసిన ప్రయత్నం చేసిన పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆవేదన చెందారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు21: మండలంలోని చందమియాబాగ్‌తాండా వద్ద 44వ జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని భీమ్‌గల్ మండలం సుదర్శన్‌నగర్‌తాండాకు బుక్యసీతారాం (6) మృతి చెందినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం 6గంటలకు సీతరాం మాక్లూర్ మండలం మదన్‌పల్లి తండాలోని తన కూతురు ఇంటి నుంచి బైక్‌పై తన సొంత గ్రామానికి వెళ్తుండగా చందమియాబాగ్‌తాండా వద్ద న్యూటర్న్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొందని తెలిపారు. తీవ్రగాయాలైన సీతారాంను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం చికిత్స పొందుతూ సీతారాం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు బుక్య సురేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పాత పింఛన్ సాధనకై ఎమ్మెల్సీ బరిలోకి

పెర్కిట్, సెప్టెంబరు21: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ వచ్చే సంవత్సరం మార్చిలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో తాను నిలబడుతున్నట్టు తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ నాయకులు కృష్ణరావు తెలిపారు. ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆర్మూర్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, ప్రిన్సిపాల్, గురుకుల అధ్యాపకులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించుకోవాలి

నవీపేట,సెప్టెంబరు 21: విద్యార్థులు శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కోయేడి నర్సింలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నవోదయ కళాశాలలో శాస్త్రీయ దృక్పదం, రాజ్యాంగంపై అవగాహన అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయత, సమానత్వం, ప్రశ్నించడం వంటి అంశాలపై తమ వైఖరిని పెంపొందించుకోవాలని అన్నారు. అలాగే చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, రాజశేఖర్, కిషన్, లక్ష్మణ్ రాజ్, శ్రీరాం గౌడ్, తదితరులున్నారు.

వర్షానికి కూలిన జడ్పీహెచ్ఎస్ ప్రహరీ

మోపాల్, సెప్టెంబరు 21: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మోపాల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరిగోడ కూలిపోయిన పట్టించుకునే వారు కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రహరిగోడ కూలిపోవడంతో పాములు, విష పురుగులు పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారని అన్నారు. జెడ్పీహెచ్ఎస్ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల కూడా ఇందులోనే కొనసాగుతుందన్నారు. పాఠశాల ఆవరణ పెద్దగా ఉన్నప్పటికీ ఈ పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరిగోడ కూలిపోవడం వల్ల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కూలిపోయిన ప్రహరిగోడను స్థానిక ప్రజాప్రతినిధులు, విడిసి పెద్దలు వచ్చి పరిశీలించారని ఉపాధ్యాయులు తెలిపారు. కూలిపోయిన ప్రహరిగోడను వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

డొంకేశ్వర్, సెప్టెంబరు21: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి అన్నారు. శనివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో మహాలక్ష్మీ పథకానికి సంబంధించి సబ్సిడీ పత్రాలను ఆయన ఇంటింటికి వెళ్ల లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గోపినాథ్, మండల అధ్యక్షుడు జంగుల గోపి, గంగుల గంగాధర్, సుంకరి నాగరాజు, ముఖేష్‌యాదవ్, బార్ల రవీందర్‌రెడ్డి, బార్ల గంగారెడ్డి, నాయకుడు రవీందర్, గుడ్డెటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టీయూలో జాతీయ సైన్స్ డే వేడుకలు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 21: డిపార్టుమెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ యూని వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ టెక్నాల.ఈ సంయుక్తంగా శనివారం వర్సిటీలో జాతీయ సైన్స్ దినోత్సం -2024 నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి పునరుత్పాదక సహజవనరులను బాధ్యతగా ఉపయోగించుకోవడం అనే అంశంపై ప్రముఖులు ప్రసంగించారు. సీఐఎమ్‌ఏపీ శాస్త్రవేత్త కోటేశ్ కుమార్, ఓయూ ప్రొఫెసర్ జలపతి లు పాల్గొన్నారు. ప్రొ.జలపతి మాట్లాడుతూ.. డ్రగ్ డిస్కవరి ప్రాసెస్ మరియు కెమిస్ట్రీలో ఏఐ టెక్నాల.ఈ ప్రభావం రోజురోజుకు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి , ప్రిన్సిపాల్ ఆరతి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ముప్కాల్, సెప్టెంబరు21: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వాతావరణంలో జరిగిన తేమ వల్ల వరి లో తెగుళ్ళ, కీటకల ఉధృతి పెరిగిందని రైతులు సస్య రక్షణ చేపట్టాలని బాల్కొండ మండల వ్యవసా యాధికారి లావణ్య తెలిపారు. శనివారం బాల్కొండ మండల కేంద్రంలోని వరి క్షేత్రాలను ఆమె పరిశీలిం చారు. వరిలో బ్యాక్టిరియా ఆకు, ఎండా తెగులు, అగ్గి తెగులు, సుడి దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్టు వారు తలిపారు. క్రిమికిటకలు, తెగుళ్ళ వాటి తొలి దశలోనే గుర్తించడంతో పటిష్టమైన నివారణ చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని రైతులకు ఆమె సూచించారు.

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో
స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం



ర్యాలీని ప్రారంభిస్తున్న నగర మేయర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 21:నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నగరంలోని 20వ డివిజన్, డంపింగ్ యార్డు, గంగాస్థాన్ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించివేశారు. తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేశారు. అనంతరం స్థానికులకు తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కల్పించారు.అనంతరం నగరంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో స్వచ్ఛత హీ సేవా సానిటేషన్ వాహనాలను నగర మేయర్ దండు నీతూకిరణ్ ప్రారంభించారు. ఈవాహనాలు రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాల ద్వారా చెత్తను ఏరుకుంటూ పూలాంగ్ చౌరస్తా వరకు జరిగింది. ఈ సందర్భంగా నగర మేయర్ దండు నీతూ కిరణ్, నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో చెత్తను లేకుండా చూసేలా అన్ని ప్రాంతాల్లో చెత్తను తీసివేస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు21: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కమలానెహ్రూకాలనీలో ప్రాథమి క పాఠశాలలో శనివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించి మానవహారం చేశారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛతాహీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టార్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీనెయ్యి వాడిన వారిపై చర్యలు తీసుకోవాలి : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెర్కిట్, సెప్టెంబరు21: కలియుగ దైవం శ్రీ ఏడుకొండల స్వామి పరమపవిత్రమైన లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన గత ప్రభుత్వంలో విధులు నిర్వహించిన అధికారులను విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం ఆర్మూర్ పట్టణ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ మాట్లాడుతూ పవిత్రమైన శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యితో తయారు చేయడం వంటి విషయంపై కేంద్ర ప్రభుత్వ హోంశాఖమంత్రి అమిత్‌షా స్పందించి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ బీజేపీ ప్రధానకార్యదర్శి పులి యుగంధర్, ఉపాధ్యక్షుడు దొండి ప్రకాష్, కార్యదర్శి మిర్యాల్‌కర్ కిరణ్, పట్టణ బీజేపీవైఎం అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, ఓబీసీమోర్చ పట్టణ అధ్యక్షుడు బాశెట్టి రాజ్‌కుమార్, కార్యదర్శి రెడ్డబోయిన మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌రూరల్: అసైన్డ్ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయ కులు మాట్లాడుతూ అసైన్డ్ భూములలో అక్రమంగా ఇంటి నెంబర్‌లు కేటా యించారని, వారు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలని గత కొంత కాలంగా ఫిర్యాదు చేస్తున్న పట్టించు కోవడంలేదని, 144నెంబర్‌లు అక్ర మంగా ఇచ్చారని వారన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై సహకరి స్తున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీ జేపీ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ. నర్సింహరెడ్డి, పట్టణ ప్రధానకార్యదర్శివేణు, ఉపాధ్యక్షుడు ఆరే రాజే శ్వర్, మిర్యాల్‌కర్ కిరణ్, ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలని వినతి

భీమ్‌గల్, సెప్టెంబరు21: భీమ్‌గల్ పట్టణంలో కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైకోర్టు న్యాయమూర్తి సురేందర్, జిల్లా కోర్టు న్యాయమూర్తి కుంచాల సునీత కు వినతిపత్రం అందజేశారు. గతంలో పట్టణానికి మంజూరైన కోర్టు ను తిరిగి ఆర్మూర్‌లో ఏర్పాటు చేశారని, దీంతో ఇక్కడి ప్రాంత ప్రజలు వివిధ కేసుల నిమిత్తం ఆర్మూర్ కోర్టుకు సరైన సమయంలో చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, భీమ్‌గల్‌లో కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు.వారిలో అధ్యక్షుడు అశోక్, నాయకులు మల్లెల లక్ష్మణ్, కాంగ్రెస్ న్యాయవాదులు చైతన్య, సర్వసమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి

ముప్కాల్, సెప్టెంబరు21: బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామానికి చెందని సొసైటీ డైరెక్టర్ గురికాడి లింబాద్రి(50) మద్యమత్తులో కిందపడి మృతి చెందాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శనివారం నాగాపూర్ గ్రామంలో తన ఫాంహౌజ్‌లో తోటి డైరెక్టర్‌తో కలిసి విందు చేసుకున్నాడు. అనంతరం మద్యం తాగిన మత్తులో ఇంటికి వెళ్తుండగా ఆకస్మాత్తుగా బైక్ కింద పడి ముఖం, ముక్కు, కణత తీవ్రగాయాలై లింబాద్రి అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని భార్య గురికాడి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై నరేష్ తెలిపారు.

ఉరేసుకొని యువకుడి మృతి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 21: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన తేలు రాధకృష్ణ (32) శనివారం ప్యాను కు తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కున్నట్లు ఎస్సై షరీప్ ఒక ప్రకటనలో తెలిపారు. తాగుడికి బానిసగా మారి ఉరి వేసుకున్నడని భార్య సంగీత పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోర్తాడ్‌లో వరి పంట పరిశీలన

మోర్తాడ్, సెప్టెంబరు21: మండల కేంద్రంలో మండల వ్యవసాయాధికారి, సిబ్బంది కలిసి శనివారం క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల మూలంగా వరి పంటలో బ్యాక్టీరియా ఆకు, ఎండాకు తెగులు, సుడిదోమ వ్యాపిస్తుందని రైతులు వరి పంటకు పిచికారి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు మనోజ్, రాజేష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పంటలను ఆరబోయకూడదు

భీమ్‌గల్, సెప్టెంబరు21: రోడ్లపై పంట ధాన్యాలను ఆరబోయకూడదని ఎస్సై మహేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంటను డ్లను ఆరబోయడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రైతులు రోడ్లపై పోయకుడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి రోడ్డు ప్రమాదాలకు కారణమైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వకూడదని ఎస్సై తెలిపారు.

మత్తు పదార్థాల నివారణపై రైల్వే అధికారుల దృష్టి


రైల్వే స్టేషన్‌లో సోదాలు చేస్తున్న పోలీసులు

ఖిల్లా, సెప్టెంబరు 21: మత్తు పదార్థాల నివారణపైరైల్వే అధికారులు ఫోకస్ పెట్టారు.మత్తు పదార్థాల అక్రమరవాణా జరుగకుండా చర్యలు చేపట్టారు. మత్తు పదార్థాలు రవాణా చేసేవారిని గుర్తించే పనిలో పడ్డారు.సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందన దీప్తి, పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగ నెవార్ ఆదేశాల మేరకు శనివారం నగరంలోని రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఒక టోటౌన్ ఏఎస్సై యాకత్ అలీ, రైల్వే ఎస్సైసాయిరెడ్డి, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి మోహన్, సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల వస్తువులను పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న వారిని గుర్తించి వివరాలు సేకరించారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్‌లో గల పార్సిల్ కార్యాలయంలో ప్రతీ పార్సిల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో మత్తు పదార్థాలు గుర్తించేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అక్రమ రవాణా చేస్తున్న మత్తు పదార్థాలను అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ఈ తనిఖీలు ప్రతీరోజు ఉంటాయని తెలిపారు.

అర్బన్ ఎమ్మెల్యేకు టీజీవీపీ వినతి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 21: నిజామాబాద్ నగరంలో విద్యాసంస్థల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు తెలంగాణ విద్యార్థి పరిషత్ ప్రతినిధులు శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యాసంస్థల అభివృద్ధిని వేగవంతం చేయాలని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కళాశాల, వ్యవసాయ కళాశాల, ఫార్మసీ కళాశాల వంటి ముఖ్య విద్యాసంస్థలను నగరంలో ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని కోరాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, నగర అధ్యక్షుడు అఖిల్, మనోజ్, సుజిత్, సాయి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖిల్లా, సెప్టెంబరు 21: ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం తెల్లవారుజామున నవీపేట రైల్వేస్టేషన్ సమీపంలో జరిగినట్లు ఎస్సై సాయరెడ్డి తెలిపారు. నవీపేట మండలం అభంగపట్నం గ్రామానికి చెందిన అల్లె వినోద్‌కుమార్ బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లడానికి ప్రయత్నించగా వీసా రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు.పైగా ఆయన చేసిన అప్పులు పెరిగిపోవడంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దాసు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు21: కార్మిక వ్యతిరేక నాలుగు లెబర్ కోడ్‌లను మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు దాసు కోరారు. శనివారం మామిడిపల్లిలో గ్రామపంచాయతీ కార్మికుల విస్తృత సమా వేశంలో మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ.26వేలు పెంచి ఇవ్వాలని, ఎనిమిది గంటల పని విధానం యాథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చే శారు. గతంలో కేసీఆర్ సఫాయి కార్మికులకు నిజమైన దేవుళ్లు అని దండం పెట్టి వారి జీవితాలను చీకటి మయం చేశారని విమర్శించారు. గతంలో పర్మి నెంట్ చేయాలని సమ్మె చేస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చి అధికా రంలోకి రావాలని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిం దని, ఇచ్చిన మాటను వెంటనే అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ కార్య క్రమంలో జేపీ గంగాధర్, భానుచందర్, పోశెట్టి, లక్ష్మణ్, శేఖర్, గంగన్న, గంగాధర్, సుధాకర్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి


నగరంలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


నందిపేటలో కొండా లక్ష్మణ్ బాపూజీ నివాళి అర్పిస్తున్న పద్మశాలీలు


ధర్పల్లిలో కొండ లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 21: బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత, స్వరాష్ట్రం పరితపించిన తెలంగాణవాది, మాజీ మంత్రివర్యులు, స్వతంత్ర్య సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని వినాయక్‌నగర్‌లోగల మహనీయుల విగ్రహాల వద్ద ఉన్న అయన విగ్రహానికి ఓబీసీ సెల్ నాయకులు రాజనరేందర్‌గౌడ్, బాసొల్ల నాగరాజు, సంతోష్, బొబ్బిలి రామకృష్ణ, సంపత్‌రాజు, వెంకట్, ప్రవీణ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రుద్రూరు: తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని శనివారం రుద్రూరు మండల కేంద్రంలో చేనేత, పద్మ శాలి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఎం.నారాయణ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవిని త్యాగం చేసి తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివని గుర్తుచేసుకున్నారు. ప్రతీ ఒక్కరు ఆయన బాటలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత, పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తెలంగాణ జాతిపితి కొండ లక్ష్మణ్ బాపూజీ ఎంతో పోరాటం చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. కొండలక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని నగరంలోని 5వ డివిజన్ బోర్గాం(పి) 62వ తర్ప ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి రచ్చ ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం కోసం ఆయన ముందుండి పోరాడారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నాయకులు పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, నర్సింలు, వేముల లక్ష్మి నర్సింహస్వామి, దశరథ్, విశ్వనాథం, రచ్చశ్రీను,పండరి పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కోసం చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన అడుగు జాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలుక రాజు, గ్రామ అధ్యక్షుడు పాము నారాయణ, ప్రధాన కార్యదర్శి నారాయణ, కోశాధికారి డాక్టర్ నందు, ఉపాధ్యక్షుడు భూమేష్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్: మండల కేంద్రంలో పద్మశాలి సంఘంలో శనివారం స్వర్గీయ కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పద్మశాలిలు కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. పద్మశాలి అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని, ప్రతీఒక్కరు ఆయన అడుగు జాడల్లో నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు జోగు నర్సయ్య, బ్రహ్మదండి చిన్నయ్య, నర్సింగ్‌దాస్, గంగాధర్, పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మోర్తాడ్: తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ వైతాళికుడు కొండలక్ష్మన్‌బాపూజీ 13వవర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. శనివారం మోర్తాడ్ మండల కేంద్రంలో దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరి రా జారాం కొండా లక్ష్మన్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.బాపూజీ గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జంబవా మామిడి నారాయణ, అమర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంలో శనివారం మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ ముఖ్య నాయకుడు కొండ లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1915 సెప్టెంబరు 27న వాంకిడిలో జన్మించిన బాపూజీ 2012 సెప్టెంబరు 21న హైదరాబాద్‌లో మృతి చెందాడని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొడ్డు రాజశేఖర్, నాయకులు చింత బాల గంగాధర్, కొండ గంగాధర్, సంబారు గిరిధర్, మానస్పూర్ భూమేశ్వర్, స్వర్గం నర్సయ్య, బొడ్డు మురళి, విఠల్ తధితరులు ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. కొండ లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి సందర్భంగా జిరాయత్ నగర్‌లో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బ్రిటిష్ పరిపాలనను వ్యతిరేకిస్తూ పోరాటం చేశారని, చేనేత సహకార ఉద్యమంలో నిజం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, తెలంగాణ తొలిమలి ఉద్యమంలో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన ఆయన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో పీసీసీ మాజీ కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షు డు అంబల్ల శ్రీనివాస్, బోడ్డు గంగాధర్, వనం శేఖర్, కొక్కుల రమాకాంత్, అనంత్‌రావు, చిట్ల యాగేష్, గుద్దెటి రమేష్, ఆడేపు ప్రభాకర్, మోహన్‌దాస్, కట్కం నరేందర్, పద్మశాలి సంఘం అన్ని తర్పల అధ్యక్షులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: స్వరాష్ట్రంకోసం పరితపించిన తెలంగాణవాది, నిబద్ధత కలిగిన రాజకీయవేత్త, స్వతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12 వ వర్ధంతిని మండలకేంద్రంలో మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల సంఘం అధ్యక్షుడు చింత తిరుపతి,పాలకవర్గ సభ్యులు నల్ల భూమేశ్వర్, పోతు ధరణి కుమార్, పిల్లమారి సుధాకర్, పోతు మురళి, అంబల్ల అరవింద్, జిందం హరికుమార్, తదితర పద్మశాలి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, హాజరైన అధికారులు

నిజామాబాద్‌అర్బన్, సెప్టెంబరు 21: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలోని అయన ఛాంబర్‌లో శనివారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తెస్తున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలో ఈసారి ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4.10లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేశారని, 11.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందని ఇందులో సన్నరకం ధాన్యం అత్యధికంగా 85 శాతం ఉంద న్నారు. రైతులు తమ సొంత అవసరాల కోసం, ఇతర ప్రైవేటు వ్యాపారులకు విక్రయాలు జరిపే ధాన్యాన్ని మినహాయిస్తే ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 8లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని తరలించే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో 480కి పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ధాన్యం దిగుబడులు చేతికందే సమయానికి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర పొందేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం ఏ-గ్రేడ్ రకానికి క్వింటాలు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రాల్లోనూ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచి రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు పరస్పర సమన్వయంతో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో సాయాగౌడ్, డిఎస్‌వో అర్వింద్‌రెడ్డి, సివిల్ సప్లై డిఎం రమేష్, డిసివో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి జూడో ఎంపికలు పూర్తి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 21: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూడో క్రీడలను శనివారం నిర్వహించారు. నగరంలోని డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్ మైదానంలో ఈ ఎంపికలను నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. సుమారు 500 మంది క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. 300 మంది బాలురు, 200 మంది బాలికలు పాల్గొన్నారు. ఇందులో అత్యంత ప్రతిభకనబర్చిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి అన్నారు. ఈ ఎంపికలో ఫిజికల్ డైరెక్టర్ వెంకట్, జూడో అసోసియేషన్ కార్యదర్శి అభినవ్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అటవీశాఖ ఉద్యోగుల జోనల్ పోటీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 21:అటవీశాఖ బాసర జోనల్ స్థాయి ఉద్యోగుల క్రీడలు ప్రశాంతంగా ముగిసాయి. నగరంలోని రాజారాం స్టేడియంలో వివిధ క్రీడల విభాగంలో శనివారం పోటీపడ్డారు. నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల జట్లు వివిధ క్రీడల్లో పోటీ పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ క్రీడాంశాలు ఆసక్తికరంగా సాగాయి. ఈ పోటీలను సిసిఎఫ్ శర్వానన్ పర్యవేక్షించారు. ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. ప్రతీరోజు ఉద్యోగాల్లో ఒత్తిడితో ఉన్న ఉద్యోగులకు ఈ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్‌వోలు నిఖిత, ప్రశాంత్, ఎఫ్‌డివోలు సుధాకర్‌రావు, భవానిశంకర్, ఎఫ్ఆర్‌వోలు సంజయ్‌గౌడ్, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

నిశిత పాఠశాలలో క్రీడా స్థలం ప్రారంభం



గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 21: నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలోగల అమ్మ వెంచర్‌లో ఉన్న నిశిత ఇంటర్నేషనల్ పాఠశాల క్రీడా స్థలాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు శనివారం ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి. దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన గ్రౌండ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఆటపాటలలో పాల్గొంటే ఆరోగ్యంగా, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని ఆటల ప్రాముఖ్యతను గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులకు చదువు ఒక్కటే కాదని ఆటలు కూడా ముఖ్యమని ప్రతీ ఒక్కరు ఆటలలో భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. డీవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆటలలో గెలుపు ఓటములు సహజమని ఈ రోజుల్లో అపజయాలు కలిగితే క్షణికావేశంలో పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గెలుపు ఓటములు ఆటలలో సర్వసాధారణం అనే విషయాన్ని విద్యార్థులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిశిత ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ నిఖిల్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రసిడెంట్, పాఠశాల చీఫ్ ప్యాట్రన్ వినయ్‌కుమార్, డైరెక్టర్ పూజ, కోఆర్డినేటర్ రాజు, ప్రిన్సిపాల్ రమీందర్ కౌర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పిస్తాం : రూరల్ ఎమ్మెల్యే


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 21: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని అందుకు నిధులు మంజూరు చేస్తానని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. శనివారం డిచ్‌పల్లిలో జరిగిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్ సేవలు దేశఅభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ కమిషన్ సభ్యురాలు సుధంలక్ష్మీ, డీసీఎంఎస్ చైర్మన్ తారచంద్ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి రసుల్‌బి,సీడీపీవో స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

28, 29 తేదీలలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 21: ఈనెల 28, 29 తేదీలలో సీనియర్ రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి బాలశేఖర్ తెలిపారు. నగరంలోని శివాజీనగర్ మున్నూరుకాపు కళ్యాణ మండపంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యోగా రాంచందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంగీత, హెచ్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వర్నిలో క్రీడా పోటీలు


కబడ్డీ అడుతున్న క్రీడాకారులు

వర్ని,సెప్టెంబరు 21: పీడీఎస్‌యూ 50వ వసంతాల సందర్భంగా వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అనిల్, గౌతమ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం అందరికి ఉచిత నాణ్యమైన విద్య శాస్త్రీయ విద్య కోసం పోరాడుతున్నది పీడీఎస్‌యూ అని గుర్తు చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో గేములకు పరిమితమై మానసిక వ్యాధిగ్రస్తులవుతున్న సందర్భంగా వారిలో శారీరక ఉత్తేజాన్ని నింపేందుకు ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, నాయకులు సాయినాథ్, నాని, శేఖర్, మహేష్, గోపాల్, రాకేష్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూరు, సెప్టెంబరు 21: రుద్రూరు మండలం అంబం (ఆర్)లోని ఆదర్శ పాఠశాల, జూ నియర్ కాలేజీలో ఖాళీగా ఉన్న అధ్యాపక ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెన్నప్ప పేర్కొన్నారు. పీజీటీ తెలుగు-2, పీజీటీ జువాలజీ-1, టీజీటీ ఇంగ్లీష్-1, టీజీటీ మ్యాథ్స్-1 మొత్తం ఖాళీలకు ఈనెల 23 వరకు దరఖాస్తులు చేసు కోవా లని కోరారు. పీజీటీ సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేట్, బీఈడీ ఉండాలని, టీజీటీ సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ, టెట్ క్వాలీపై అయిన వారు దరఖాస్తులను చేసుకోవచ్చన్నారు.

అక్టోబరు 3 నుంచి ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 21: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ ఎస్సెస్సీ ఇంటర్ పరీక్షలు అక్టోబరు 3నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి. దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ హిందీ విద్యాల యంలో మాత్రమే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ప్రతీరోజు ఉద యం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గం టల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 ల వరకు రెండవ సెషన్‌లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 16 నుంచి 23 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖిల్లాలో నిర్వహించడం జరుగుతుందన్నారు.అభ్య ర్థులు తమ హాల్‌టికెట్లను సంబంధిత ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ల నుంచి పొం దాలని ఆయన తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది
బాన రమేష్ యాదవ్ S/o గంగారాం బాన H.NO. 2-10, గ్రా. ఉప్పూర్, మం. కమ్మర్‌పల్లి, జి. నిజామాబాద్, TS, నాయొక్క పాస్‌పోర్ట్ నెం. P998386 గలది హైదరాబాద్ నుండి ఉప్పూర్ గ్రామానికి ఇంటి సామాను తరలిస్తుండగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు 9948711356 కు తెలుపగలరు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.76000	రూ.70000	రూ.925

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్
స్క్రీన్-1 : ఫైలం పిలగా (1.15)
: మత్తు వదలరా-2 (4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (3డి ఇంగ్లీష్) (11.00, 4.35)
: యుద్ర (హిందీ) (1.30, 7.05)
: గొర్రె పురాణం (10.10)
స్క్రీన్-3 : మత్తు వదలరా-2 (12.50)
: సరిపోదా శనివారం (3.50, 10.30)
: యుద్ర (హిందీ) (7.25)
స్క్రీన్-4 : చీక్‌లెట్స్ (తెలుగు) (10.25)
: తుంబ్బడ్ (హిందీ) (1.05)
: మనం (3.45)
: మాయాబజార్ (7.10)
: స్త్రీ-2 (హిందీ) (11.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1 : 35-చిన్నకథ కాదు (4.30)
: మత్తు వదలరా-2 (7.20, 10.25)
స్క్రీన్-2 : సరిపోదా శనివారం (1.30, 7.25)
స్క్రీన్-3 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (ఇంగ్లీష్ 3డి) (11.00, 4.40, 10.35)

దేవి : మత్తు వదలరా-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: యుద్ర (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: బొమ్మరిల్లు (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్